క్లుప్తంగా

వెలగని హైమాస్ట్ లైట్లు



పని చేయని హైమాస్ట్ లైట్లు

లింగాపూర్: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలగకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రంలోని వివిధ చౌరస్తాల్లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లలో కొన్ని పని చేయడం లేదు. వర్షాకాలం నేపథ్యంలో రాత్రి వేళల్లో విషసర్పాలు సంచరించే అవకాశం ఉండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు స్పందించి లైట్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటింటికీ మొక్కలు పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు

లింగాపూర్: మండల కేంద్రంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పంచాయతీ అధికారులు ట్రాక్టర్ల ద్వారా ఇంటింటికీ 5 మొక్కలు పంపిణీ చేశారు. పంచాయతీ సెక్రటరీ రజనీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

లింగాపూర్: రైతుబీమా కోసం ఆగస్టు 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మండల ఇన్‌చార్జి ఏఈవో శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తగా పట్టాదారు పాసుపుస్తకం వచ్చిన వారు ఆధార్‌కార్డు జిరాక్స్, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్, పట్టా పుస్తకం జిరాక్స్‌లతో రైతుబీమా దరఖాస్తు ఫారం నింపి వ్యవసాయశాఖ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

‘ప్రేంసింగ్ సేవలు మరువలేనివి’

కెరమెరి: కొన్నేళ్లుగా విద్యార్థులకు సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన బాదావత్ ప్రేంసింగ్ సేవలు మరువలేనివని జీసీడీవో శకుంతల, జైనూర్ ఏటీడీవో పురుషోత్తం అన్నారు. బుధవారం మండలంలోని మోడి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు శకుంతల, బలిరాం, ఉపాధ్యాయులు వసంత్‌రావు, చంద్రశేఖర్, శ్యాంరావు, నారాయణ, దాము, కర్ను, మోతిరాం, సీఆర్‌టీలు ఉన్నారు.

విద్యాభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: విద్యార్థుల విద్యాభివృద్ధికి పాటుపడాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలకు నిర్వహించిన న్యాస్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇక్కడ ఆర్‌పీలు నేర్పిన అంశాల ఆధారంగా విద్యార్థులకు బోధించాలన్నారు. రోజువారీగా ప్రణాళికలు తయారు చేసి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కెరమెరి, ఝరి కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్, భరత్‌కుమార్ ఉన్నారు.

‘బ్యాంకు వద్ద రద్దీ నివారణ చర్యలు చేపట్టాలి’

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని రాజంపేట ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామీణ బ్యాంకు ఎదుట రోడ్డుపై వాహనాలు నిలపడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రద్దీని నివారించడానికి బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని సీనియర్ న్యాయవాది, బీజేపీ నాయకుడు బోనగిరి సతీశ్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం బ్యాంకు రోడ్డును సందర్శించి ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికైనా ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీలో దరఖాస్తు నమోదు చేస్తామన్నారు.

మానవ హక్కులపై అవగాహన

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రాష్ట్ర మానవ హక్కుల కౌన్సిల్ ఆధ్వర్యంలో మానవ హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సామాజిక కార్యకర్త మమత విద్యార్థులకు మానవ హక్కులు, పోక్సో చట్టం, మొదలైన అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం, వైస్ ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంతెన లేక ఇక్కట్లు

- ఇబ్బందుల్లో కాగజ్‌నగర్, భీమిని, కన్నెపల్లి మండలాల వాసులు
- వర్షాకాలంలో రాకపోకలకు తిప్పలు
- వంతెన నిర్మాణం చేపట్టాలని వేడుకోలు



వంతెన లేని రాగిపాటి ఒర్రె

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామ శివారులో గల రాగిపాటి ఒర్రెపై వంతెన లేకపోవడంతో మూడు మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఒర్రెపై వంతెన లేక కాగజ్‌నగర్ మండలంతో పాటు మంచిర్యాల జిల్లా భీమిని, కన్నెపల్లి మండలాల ప్రజలు సైతం అసౌకర్యానికి గురవుతున్నారు. కాగజ్‌నగర్ మండలంలోని జగన్నాథ్‌పూర్, బోడపల్లి, బోరిగాం, భీమిని మండలంలోని కర్జిభీంపూర్, లక్ష్మీపూర్, భీమిని, బిట్‌వెల్లి, రాంపూర్, మల్లీడు, దుబ్బగూడ, వడాల గ్రామాల ప్రజలతో పాటు కన్నెపల్లి మండలవాసులు ప్రతినిత్యం ఈ మార్గం గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. కాగజ్‌నగర్ పట్టణానికి ప్రతీరోజు విద్యార్థులు, ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే కార్మికులు, పాల వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారు.

రైతులకూ తప్పని కష్టాలు..

కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి, బోడపల్లి, జగన్నాథ్‌పూర్ గ్రామాల రైతులకు చెందిన భూములు ఈ ఒర్రె అవతలి వైపున ఉండటంతో రైతులు వర్షాకాలంలో ఒర్రెను దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. జగన్నాథ్‌పూర్ నుంచి కర్జిభీంపూర్ వరకు 6 కిలోమీటర్ల మేర రోడ్డు గుంతలమయంగా ఉండటంతో వర్షాకాలంలో తీవ్ర అవస్థలకు గురి కావాల్సి వస్తుంది. వర్షాకాలంలో వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఈ ఒర్రెపై వంతెన నిర్మించాలని పలుసార్లు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఒర్రెపై వంతెన నిర్మించడంతో పాటు రోడ్డు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి



రాగిపాటి ఒర్రెపై వంతెన నిర్మించాలి. భీమిని, కన్నెపల్లి, కాగజ్‌నగర్ మండలాల వాసులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. జగన్నాథ్‌పూర్ నుంచి కర్జిభీంపూర్ వరకు మట్టిరోడ్డు ఉండడంతో వర్షాకాలం బురదమయంగా మారుతోంది. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితులు ఎదురవుతున్నాయి.

– కిరణ్‌కుమార్, కన్నెపల్లి

వర్షాకాలంలో ఇబ్బందులు



పంట భూములు ఒర్రెకు అవతలివైపు ఉండటంతో ప్రతీరోజు ఒర్రె దాటాల్సివస్తుంది. ఒర్రెపై వంతెన నిర్మించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోతుంది. వంతెన లేక వర్షాకాలంలో అనేక తిప్పలు పడుతున్నాం. అధికారులు సమస్య పరిష్కరించాలి.

– నాందేవ్, జగన్నాథ్‌పూర్

కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న ప్రణయ్

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న బీసీలకు సరైన న్యాయం జరగడం లేదని, బీసీ కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ బీసీలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ బీసీలపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని, 60 శాతం ఉన్న బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. కామారెడ్డి సభలో కాంగ్రెస్ పార్టీ అధినేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు ఇచ్చిన హామీ మేరకు కులగణన చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేలుకొని బీసీలకు సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ప్రశాంత్, నారాయణశెట్టి, ఓంసాయి, ప్రణీత్, వెంకటేశ్, సమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ సభకు తరలిన బీసీ నాయకులు



కరీంనగర్ సభకు తరలివెళ్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14న కామారెడ్డి నుంచి ప్రారంభమైన సమగ్ర కులగణన సాధనయాత్ర ముగింపు సందర్భంగా బుధవారం కరీంనగర్‌లో నిర్వహించే ముగింపు సభకు జిల్లా కేంద్రం నుంచి బీసీ నాయకులు తరలివెళ్లారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్‌నార్ రమేశ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వైరాగడె మారుతి, నాయకులు లహుకుమార్, నాగోసె శంకర్, పురుషోత్తం, జక్కన్న, రమేశ్ ఉన్నారు.

ప్రతీ గూడెంలో జెండా ఎగురవేయాలి



మాట్లాడుతున్న సార్మెడీలు

కెరమెరి: ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం పురస్కరించుకొని అన్ని గూడేల్లో జెండా ఎగురవేయాలని రాయిసెంటర్ సార్మెడీలు కుమురం అంబారావు, పెందోర్ రాజేశ్వర్ అన్నారు. బుధవారం హట్టి బేస్ క్యాంపులో ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. హట్టితో పాటు సాకా చౌరస్తాల్లో ఉన్న భీం విగ్రహాలకు పూలమాల వేయాలని, జోడేఘాట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించాలన్నారు. కార్యక్రమాన్ని గూడేల్లోని ఆదివాసీలు పండుగలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పెందోర్ మోతీరాం, మడావి రఘునాథ్, కోవ విజయ్, భరత్ భూషణ్, కుద్మెత సోము, సెడ్మకి తుకారాం, కుమురం భీంరావు, సిడాం రాంచందర్, కుమురం సాగర్, లక్ష్మణ్, దంబిరావు తదితరులు ఉన్నారు.

‘రుణమాఫీపై ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలి’



జావిద్ అలీ ఖాన్

బెజ్జూర్: నిలుపుదల చేసిన రుణమాఫీపై ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ ఆసిఫాబాద్ జిల్లా సీనియర్ నాయకుడు జవిద్‌అలీఖాన్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రేషన్ కార్డు లేదనే పేరుతో నిలిపివేసిన రైతుల రుణమాఫీపై తక్షణమే స్పందించాలన్నారు. 15 ఏళ్ల నాటి రేషన్‌కార్డులో ఉన్న అవిభాజ్య కుటుంబాల్లోని పిల్లలను ఒకే కుటుంబంగా చూడడంతో వేరుపడిన అనేక మంది రైతుల కుటుంబాలకు రుణమాఫీ కాలేదని తెలిపారు. ఇక కౌలు రైతుల గుర్తింపు చర్యలు లేకపోవడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని మండిపడ్డారు.

యూనిసెఫ్ బృందం పర్యటన



రెబ్బెన పీహెచ్‌సీ వద్ద సభ్యులు

రెబ్బెన: మండలంలో బుధవారం యూనిసెఫ్ బృందం సభ్యులు విస్తృతంగా పర్యటించారు. ముందుగా మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో అందుతున్న సేవలు, ఐదేళ్ల లోపు పిల్లలకు అందిస్తున్న టీకాలపై సభ్యులు డాక్టర్ ఖ్యాతి తివారి, డాక్టర్ రేషా దేశాయ్ ఆరా తీశారు. అనంతరం మండల కేంద్రంలోని సబ్ సెంటర్‌ను సందర్శించారు. నూతనంగా నిర్మించిన సబ్ సెంటర్‌లో సేవలు ప్రారంభం కాకపోవడంపై కారణాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో సామగ్రి రాక ప్రస్తుతానికి పాత సబ్ సెంటర్‌లోనే సేవలందిస్తున్నామని వైద్యసిబ్బంది తెలిపారు. అనంతరం రెబ్బెన, తక్కళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. స్టేట్ కన్సల్టెంట్ డాక్టర్ నరసింహారావు, జిల్లా కన్సల్టెంట్ రంజిత్, జిల్లా టెక్నికల్ అసోసియేట్ రఘువీర్, ప్రవీణ్, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ గోపాలక్రిష్ణ, పీహెచ్‌సీ డాక్టర్లు సుజిత్, మోహన్, రాకేశ్, హెచ్‌వీ గ్లోరీ, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

కౌటాల: రైతులకు అధిక ధరలకు పురుగుల మందులు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. కౌటాల మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. మందులు, స్టాక్, రిజిస్టర్లు పరిశీలించారు. గడువు తీరిన మందులు విక్రయిస్తే షాపులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 5లోగా రైతుబీమాకు దరఖాస్తులు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏవో పి.రాజేశ్, ఏఈవో ఘన్‌శ్యాం ఉన్నారు.

న్యాస్‌పై శిక్షణ తరగతులు

కౌటాల: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో కౌటాల, గుండాయిపేట్, ముత్తంపేట పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్‌ఏఎస్)పై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో సోమయ్య పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి 3వ తరగతి విద్యార్థులకు తరగతి స్థాయి సామర్థ్యాలు పెంపొందిండానికి అనుసరించాల్సిన ప్రణాళికలపై వివరించారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని, చదవడం, రాయడం, వినడంలో విద్యార్థులను మెరుగుపర్చాలన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి హన్మంతు, ఆర్‌పీలు విజయ్, సంజయ్, ప్రదీప్, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, హెచ్‌ఎం నారాయణ సింగ్, సీఆర్పీలు ప్రకాశ్, దేవన్న, లాలాజీ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇంటి గోడ



ఖర్జెల్లి గ్రామంలో కూలిన ఇంటి గోడ

చింతలమానెపల్లి: మండలంలో భారీ వర్షాలు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మండలంలోని ఖర్జవెల్లిలో బుధవారం తెల్లవారుజామున అప్పాల పెంటయ్య అనే వ్యక్తికి చెందిన ఇల్లు గోడ కూలిపోయింది. కాగా ఆ సమయంలో కుటుంబ సభ్యులు గోడకు మరోవైపున ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. నిరుపేద కుటుంబానికి చెందిన తనకు ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి సహాయం అందించాలని పెంటయ్య కోరుతున్నాడు.

ప్రతీ ఉద్యోగికి విరమణ సహజం

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతీ ఉద్యోగి జీవితంలో ఉద్యోగ విరమణ సహజమని జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు అన్నారు. జిల్లా ఖజానా అధికారి జాడి రాజేశ్వర్, ఎస్‌టీవోకే వినోద్ కుమార్‌లు పదవీ విరమణ పొందిన సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపఖజానా అధికారి భానుమతి, ఉద్యోగులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థికసాయం



సరుకులు అందజేస్తున్న పర్వీన్ సుల్తానా జావిద్

బెజ్జూర్: బెజ్జూర్ గ్రామపంచాయతీ ఎలుకపెల్లి గ్రామానికి చెందిన గుర్లే చిన్నన్న ఇటీవల మృతిచెందాడు. పెద్ద దిక్కు కోల్పోయి ఆ కుటుంబం ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలుసుకున్న స్థానిక తాజా మాజీ ఎంపీటీసీ సభ్యులు పర్వీన్ సుల్తానా జావిద్ 50 కిలోల బియ్యాన్ని బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. భీమన్న, మల్లేష్, తిరుపతి, వైకుంఠం, అరుణ్, శ్రీకాంత్, సాయి, శ్యామ్, అంజి, రాజశేఖర్, నానయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం కోసం మెరుగైన వైద్యసేవలు



కాగజ్‌నగర్ ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కాగజ్‌నగర్‌రూరల్: ప్రజల సంక్షేమం కోసం మెరుగైన వైద్యసేవలు అందిస్తామని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లాగౌడ్ తోటలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది కొరత తీర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సాధారణ బదిలీల ప్రక్రియ పూర్తయిందని మిగిలిన ఖాళీలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం భర్తీ చేసేందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామన్నారు. సిర్పూర్(టి), బెజ్జూర్‌లో సామాజిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలతో మెరుగైన వైద్యసేవలందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న ఆసుపత్రికి వెళ్లే దారికి మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ డీఈ రమాదేవిని ఆదేశించారు. అనంతరం మండలంలోని బసంత్‌నగర్‌లో కడక్‌నాథ్ అమిత్ మండల్ కోళ్ల పెంపకం, సరఫరా కేంద్రాన్ని సందర్శించారు. జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఎంహెచ్‌వో తుకారాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, కాగజ్‌నగర్ ఆర్‌డీవో సురేశ్, డీపీఎం సారయ్య, తహసీల్దార్ కిరణ్, మండల అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు రెండు మొక్కలు నాటాలి

- డీఎస్పీ సదయ్య



మొక్కలు నాటుతున్న డీఎస్పీ సదయ్య

కెరమెరి: ప్రతీ ఒక్కరు తమవంతు బాధ్యతగా రెండు మొక్కలు నాటాలని డీఎస్పీ సదయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. వనమహోత్సవంలో భాగంగా ఆవరణలో వంద మొక్కలు నాటారు. నాటడమే కాదని, వాటిని రక్షించడం కూడా అందరి బాధ్యత అన్నారు. అంతకుముందు సిబ్బంది పనితీరు, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పీఎస్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని పేర్కొన్నారు. స్టేషన్ ఫైళ్లలను క్రమ పద్ధతులతో అమర్చి 5ఎస్ విధానాన్ని అమలు చేయాలని తెలియజేశారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై గుంపుల విజయ్, ఏఎస్సైలు బాల్‌సింగ్, ఉల్లాస్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

సిర్పూర్(టి): మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య పనులతో పాటు వర్షాకాలంలో గ్రామాల్లో నిత్యవసర పనుల నిర్వహణపై పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహించాలని, బ్లీచింగ్‌పౌడర్‌ను బావులలో వేయించాలని, నీటి ట్యాంకులు శుభ్రం చేయించాలని, వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, కార్యాలయాల్లో మొక్కలు నాటాలని, వీధి దీపాలను అవసరమున్న చోట ఏర్పాటు చేయాలని, తడి, పొడి చెత్తలను వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్లకు తరలించాలని, పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధిహామీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు



బురదమయంగా అగర్‌గూడ – మురళీగూడ రహదారి



సలుగుపల్లి రోడ్డుపై గుంతలో ఇటుకలు వేస్తున్న ఆర్టీసీ డ్రైవర్

పెంచికల్‌పేట్: మండలంలో గత పదిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రధాన రహదారులు బురదమయంగా మారాయి. పెంచికల్‌పేట్ –సలుగుపల్లి రహదారిలోని బొక్కివాగు వంతెన వద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో ఆర్టీసీ డ్రైవర్ కాగజ్‌నగర్ నుంచి ఇటుకలను తెచ్చి గుంత పూడ్చారు. అగర్‌గూడ నుంచి మురళీగూడ రహదారిలో ఏర్పడిన బురదతో ద్విచక్రవాహనాలు సైతం నడవలేని పరిస్థితి నెలకొంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

సింగల్‌గూడలో ‘కమ్యూనిటీ కాంటాక్ట్’



మాట్లాడుతున్న సీఐలు చిట్టిబాబు, సతీశ్

రెబ్బెన: ప్రజలకు రక్షణతో పాటు భద్రత కల్పించడం పోలీసుల బాధ్యత అని రెబ్బెన సీఐ చిట్టిబాబు అన్నారు. మండలంలోని సింగల్‌గూడలో బుధవారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇళ్లలో సోదాలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణ కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చి షెల్టర్ తీసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాలనీలో మరింత స్వీయరక్షణ కోసం సీసీ కెమెరాలు అమర్చుకోవాలని పేర్కొన్నారు. సైబర్‌నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, ఆత్మహత్యలు, లైంగిక వేధింపులు, గంజాయి, సమాజాన్ని పట్టి పీడిస్తున్న దురాచారాలతో పాటు కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీసుల సోదాల్లో 5 లీటర్ల గుడుంబా లభ్యం కాగా సీజ్ చేశారు. ఆసిఫాబాద్ సీఐ సతీశ్, రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్, వాంకిడి ఎస్సై సాగర్, తిర్యాణి ఎస్సై రమేశ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

‘రుణమాఫీపై అపోహలు వద్దు’



మాట్లాడుతున్న అధికారి రామకృష్ణ

చింతలమానెపల్లి: ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న రుణమాఫీ పథకంపై అపోహలు అవసరం లేదని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని రవీంద్రనగర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రైతులతో మాట్లాడారు. రుణమాఫీ పథకంలో అర్హులైన లబ్ధిదారులకు రుణమాఫీ అవుతుందన్నారు. రుణమాఫీపై ఎలాంటి సందేహాలు ఉన్నా వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఇప్పటివరకు 836 మంది లబ్ధిదారులకు రుణమాఫీ జరిగిందని ఆయన తెలిపారు.